క్లుప్తంగా...

నూతన కార్యవర్గం ఎన్నిక



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సంతోష్‌నగర్ కాలనీలోని బాబు జగ్జీవన్‌రాం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం సభ్యులు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షునిగా ఎస్.మనోహర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నరేష్, ఉపాధ్యక్షునిగా ఎల్. రవీందర్, సంయుక్త కార్యదర్శిగా ఎల్. ప్రభు, కోశాధికారిగా డి. విశ్వనాథ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్. కిరణ్, ఎస్.జనార్దన్, కార్యవర్గ సభ్యులుగా ఈ. ప్రేమ్, బి.మధు, డి.వినోద్, ఎం.ఉమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నార్సింగిలో ఘనంగా అమ్మవారి ఊరేగింపు



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని లక్ష్మమ్మ దేవాలయం ఆవరణలో నెలకొలిపిన దుర్గామాత ప్రతిమను మంగళవారం అర్ధరాత్రి ఘనంగా ఊరేగింపుగా తీసుకుని వెళ్లి నిమజ్జనం చేశారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని మిగతా గ్రామాలలో దసరా పండగ రోజు అమ్మవారి ప్రతిమలను నిమజ్జనం చేయగా ఒక్క నార్సింగిలో మాత్రం దసరా పండగ మరుసటి రోజు నిమజ్జనం చేయటం ఆనవాయితీగా వస్తుంది. నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర బుధవారం తెల్లవారు జాము వరకు కొనసాగింది.

కార్వాన్ కాంగ్రెస్‌లో అసంతృప్తి!

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో అయోమయం నెలకొని ఉంది. ఈ నియోజకవర్గం నుంచి టికెట్ కోసం సీనియర్ నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. టికెట్ తమకే వస్తుందన్న ఆశతో ఎదురు చూశారు. అయితే టికెట్ జెండా మోసిన కార్యకర్తలకు కాకుండా పార్టీలు మార్చి పైరవీలు చేసే అభ్యర్థికి టికెట్ కట్టబెట్టారని కాంగ్రెస్ నాయకులు పార్టీ అధిష్టానంపై ఆగ్రహంగా ఉన్నారు. ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజరీకి కేటాయించిన టికెట్‌ను రద్దు చేసి పని చేసిన వారికే టికెట్ ఇవ్వాలంటూ కార్వాన్ కాంగ్రెస్ నాయకులు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ మాణిక్‌రావు ఠాక్రేతో పాటు నగర కాంగ్రెస్ పరిశీలకుడు మన్సూర్ ఆలీ ఖాన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. చివరకు లంగర్‌హౌజ్‌లోని బాపూఘట్‌లోని గాంధీ విగ్రహం ముందు నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించినా కూడా అభ్యర్థిగానీ, ఆయన అనుచరులు గానీ చడీచప్పుడు లేకుండా ఉండడంపై కూడా పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



టి.అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న శ్రీకాంత్‌చారి తదితరులు

గోల్కొండ: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. బీజేపీ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన టి.అమర్‌సింగ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా అమర్ సింగ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అవినీతి పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్‌నే కాకుండా బీఆర్‌ఎస్ పార్టీని గుణపాఠం చెబుతారని అన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

చాంద్రాయణగుట్ట: రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సౌత్ ఈస్ట్ డీసీపీ రోహిత్ రాజ్ తెలిపారు. చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నసీబ్ నగర్‌లో బుధవారం రాత్రి 150 మంది పోలీసులతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధృవీకరణ పత్రాలు లేని 63 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీసీపీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ....అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూస్తున్నామన్నారు. అదనపు డీసీపీ మనోహర్, చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ గురునాథ్, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ షాకీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీ రోడ్లలో తప్పని ట్రాఫిక్ తిప్పలు..

వాహనదారులకు నరకం చూపిస్తున్న ట్రాఫిక్ జామ్..



చార్మినార్: అసలే ఇరుకు రోడ్లు...ఆపై వీకెండ్‌తో పాటు సెలవులు వస్తే చాలు..పాతబస్తీలో వాహనదారులు నరకాన్ని చవి చూడాల్సి వస్తోంది. నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు, దారుషిఫా చౌరస్తా నుంచి బీబీబజార్ చౌరస్తా వరకు, మదీనా నుంచి పురానాపూల్ చౌరస్తా వరకు ట్రాఫిక్ జాం కనిపిస్తుంది. ముఖ్యంగా ఉదయం,సాయంత్రం వేళల్లో ఇక్కడ వాహనాలతో అడుగుపెట్టిన వారెవరైనా సరే....క్లచ్ పట్టుకోవడం...గేర్ మార్చడం.... అంతకుమించి అంగుళమైనా ముందుకు కదల్లేరు. ఇక నడిరోడ్లను ఆక్రమించి కొనసాగే చిరు వ్యాపారాలతో ప్రతి నిత్యం ట్రాఫిక్ జాంలు తప్పడం లేదు. చార్మినార్ ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్లతో పాటు పరిసర ప్రాంతాల రోడ్లలో ప్రతి రోజు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రధాన కూడళ్లలో అక్కడక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చినప్పటికీ....ఇంకా ట్రాఫిక్ సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ట్రాఫిక్ పోలీసులు అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ...చిరు వ్యాపారులు, వాహనదారులు వారికి సహకరించడం లేదు. కొంత మంది వాహనదారులు త్వరగా తమ గమ్యానికి వెళ్లాలనే తొందరలో ట్రాఫిక్ జాంలతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్నారు. వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. ట్రాఫిక్ సిబ్బంది వారించబోయినా వాగ్వాదానికి దిగుతున్నారు.

- కనిపించని ఫుట్‌పాత్‌లు.. నడిరోడ్డుపై పాదచారులు
- నడిరోడ్డుపై వ్యాపారాలు... ముందుకు సాగని వాహనాలు...
- ట్రాఫిక్ దిగ్బంధంలో వాహనదారులు...

నడిరోడ్డుపై వ్యాపారాలు

ఫుట్‌పాతులే కాదు.... రోడ్లు సైతం చిరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తారు. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామాగ్రి... ఒక్కటేమిటి పాతబస్తీలో సర్వం రహదారిపైనే అమ్మకానికి ఉంటాయి. వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే!.. ఇక ట్రాఫిక్ సిబ్బంది తక్కువేమి కాదు... రాకపోకల్ని గాడిలో పెట్టే పని మాని...నయానో భయానో నిబంధనల సాకు చూపి తమ టార్గెట్ పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు ఎన్నికల తనిఖీలలో పూర్తిగా నిమగ్నమయ్యారు. పర్యాటక పరంగా, వ్యాపార పరంగా, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది.

దృష్టిసారించాల్సిన అంశాలు..

- రోడ్లకిరువైపులా కొనసాగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు,ఆక్రమణల్ని నియంత్రించాలి
- రోడ్లను ఆక్రమించి అమ్మకాలు జరుపుతున్న వారిని కట్టడి చేయాలి
- ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట సిబ్బంది సంఖ్యని పెంచాలి
- చార్మినార్ ఇన్నర్,అవుటర్ రింగ్ రోడ్లలో అవసరమైన చోట రోడ్ల విస్తరణ జరగాలి
- ఇప్పటికే విస్తరించిన రోడ్ల కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలి
- అధ్వాన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలి
- అనుమతి లేకుండా రోడ్లను ఇష్టం వచ్చినట్లు తవ్వే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



గుల్జార్‌హౌజ్ చౌరస్తా వద్ద నడిరోడ్డుపై కాలినడకన సందర్శకులు

మరోసారి విజయం సాధించడం ఖాయం



ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను సన్మానిస్తున్న సాయి మల్లిక్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను బుధవారం శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్ ఆధ్వర్యంలో యువకులు ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాయి మల్లిక్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీ నుండి నాలుగోసారి పోటీ చేయనున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సాయినాథ్, సాయి కిరణ్, బండి దినేశ్, పెండ్యాల రోహిత్, వెంకట్ తదితరులు ఉన్నారు.

కోటకు పోటెత్తుతున్న పర్యాటకులు



గోల్కొండ కోట వద్ద ప్రవేశానికి క్యూ కట్టిన పర్యాటకులు

గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. బుధవారం పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచే టికెట్ కోసం క్యూ కడుతున్నారు. దసరా సెలవులు కావడంతో కుటుంబాలతో సహ కోటకు వస్తున్నారు. గత వారం రోజులుగా పర్యాటకుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతు వస్తుందని గోల్కొండ కోట హిస్టరీ గైడ్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మహ్మద్ హర్షద్ తెలిపారు.

పాతబస్తీలో మినీ బస్సులు నడపాలి



చార్మినార్: పాతబస్తీలో ఇప్పటికీ అనేక అంతర్గత బస్తీలున్నాయి. ఈ బస్తీలకు కొన్నింటికి బస్సు సౌకర్యమే లేకపోగా...మరికొన్ని బస్తీలకు పెద్ద బస్సులను నడుపుతున్నారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే మినీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. అంతర్గత బస్తీల్లోని ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన మినీ బస్సులు ఆశించిన ఫలితాలను సాధించడం లేదు. మినీ బస్సులను గల్లీల్లో కాకుండా ప్రధాన రోడ్లలో మాత్రమే నడపడానికి ఆర్టీసీ అధికారులు ఆసక్తి కనబరుస్తున్నారు. పూర్తి స్థాయిలో బస్తీలలో మినీ బస్సులను నడపడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఇరుకైన రోడ్లు...మూల మలుపులున్న రహదారులలో సైతం అక్కడక్కడ పెద్ద బస్సులనే నడుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

పెద్ద బస్సులతో తలెత్తుతున్న సమస్యలు..

పెద్ద బస్సులతో ఆయా రూట్‌లలో వెళ్లేందుకు ఆర్టీసీ సిబ్బంది జంకడంతో పాటు ప్రయాణికులకు సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్న చిన్న వాహనాల నడుమ ఇరుక్కుపోతున్న ఆర్టీసీ పెద్ద బస్సులు ముందుకు కదిలేందుకు తీవ్ర సమయం తీసుకుంటుండడంతో తోటి వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే చిన్న చిన్న ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. పాతబస్తీలోని అంతర్గత బస్తీలన్నింటికి మినీ బస్సులను నడుపుతున్నామని సంబంధిత ఆర్టీసి అధికారులు చెబుతున్నప్పటికీ..ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. ఇకనైనా మినీ బస్సులను నడపాలని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.

తెలుగు వంటకాలంటే ఇష్టం

- గచ్చిబౌలిలో అంతేరా రెస్టారెంట్‌ను ప్రారంభించిన నిఖిల్



అంతేరా రెస్టారెంట్‌ను ప్రారంభించిన సినీ నటుడు నిఖిల్ సిద్దార్థ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం తెలుగు సినిమాల పరంగా స్వర్ణయుగం తలపిస్తుంది, ఇలాంటి తరుణంలో వినూత్న కథాంశాలతో ప్రేక్షకులను అలరించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ తెలిపారు. బుధవారం గచ్చిబౌలి వేదికగా ఏర్పాటు చేసిన 'అంతేరా' కిచెన్-బార్ రెస్టారెంట్ 2వ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో నిఖిల్ సిద్ధార్థ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలుగు వంటకాలంటే అమితంగా ఇష్టపడతానని, ముఖ్యంగా అంతేరాలో కీమా బిర్యానీ రుచికి ఫిదా అయ్యానని అన్నారు. మరికొద్ది రోజుల్లో స్వయంభు సినిమాతో రాబోతున్నానని తెలిపారు. అంతేరా వ్యవస్థాపక భాగస్వామి ఆశిష్ రెడ్డి మాట్లాడుతూ మూడు ప్రాంతాల గొప్ప వారసత్వాన్ని, ఆధునిక ఆహార ప్రియులు కోరుకునే వినూత్న రుచుల మేళవింపుతో సరికొత్త రుచులను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అంతేరా భాగస్వాములు అనురాగ్ రెడ్డి, అనూహ్య రెడ్డి, మృణాల్ తదితరులు పాల్గొన్నారు.

'వందశాతం పోలింగ్ నమోదయ్యేలా అవగాహన'



అబ్దుల్ అజీజ్

చార్మినార్: వచ్చే నెల 30న జరిగే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని వంద శాతం ఓటింగ్‌ను నమోదు చేయాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం పాతబస్తీలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీజే ఆధ్వర్యంలో ఈ శాసన సభ ఎన్నికల నుంచి వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీజే ప్రతినిధులు పాల్గొన్నారు.

సందడిగా రావణ దహనం

జియాగూడ: పురానాపూల్ మూసీ ఒడ్డున 73 సంవత్సరాల నుండి విజయదశమి రావణదహన కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమని మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ అన్నారు. మంగళవారం రాత్రి విజయదశమి సీమోలంగన్ సమితి నారాయణ కాలా చారిటేబుల్ ట్రస్ట్ జితేందర్ సింగ్, మనోజ్ సింగ్, కిషన్ సింగ్, రామ్‌సింగ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటైన రావణదహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు జియాగూడ డోర్‌బస్తీ మరిగిమాత దేవాలయం నుండి భారీ ఊరేగింపుగా బయల్దేరి మూసీ నది రావణ దహనానికి చేరుకుంది. కార్పొరేటర్లు లాల్‌సింగ్, బోయిని దర్శన్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, సంఘ సేవకులు రాజేందర్ పరిషాద్ జైస్వాల్, డి.రామ్‌సింగ్, వీరేందర్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌సీయూలో ఆంత్రోపాలజీ పోస్ట్ కాంగ్రెస్ సదస్సు

రాయదుర్గం: ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ఆంత్రోపాలజీ అండ్ ఎత్నోలాజికల్ సైన్సెస్ (ఐయూఈఏఎస్) వారి 19వ వరల్డ్ ఆంత్రోపాలజీ పోస్ట్ కాంగ్రెస్ సదస్సు రెండు రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూ ఆంత్రోపాలజీ విభాగం గురు, శుక్రవారాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. ఈ సదస్సు 'ఆంత్రోపాలజీ అండ్ డిజిటల్ కల్చర్స్' అనే అంశంపై జరగనుంది. ఈ సదస్సులో 25 పానెళ్లు, అలాగే 100కు పైగా కార్యకర్తలు, ప్లానర్లు, కన్సల్టెంటులు, విద్యావేత్తలు పాల్గొంటారు.

మినీ భారత్ 'రాజేంద్రనగర్'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలతో మినీ భారత్‌గా నిలుస్తోంది. చేవెళ్ల నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న రాజేంద్రనగర్‌ను పునర్విభజనలో భాగంగా 2009లో రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. శంషాబాద్, గండిపేట్ మండలాలను కలుపుతూ నియోజకవర్గాన్ని ఏర్పరిచారు. అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేశారు. దీంతో నియోజకవర్గం అటు హైదరాబాద్... ఇటూ రంగారెడ్డి జిల్లాలకు విస్తరించింది. నియోజకవర్గంలో 62 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం, నేషనల్ పోలీసు అకాడమీతో పాటు అనేక సంస్థలు ఉన్నాయి. వీటికి తోడు అతి పెద్ద కాటేదాన్ పారిశ్రామిక వాడ, గగన్‌పహాడ్, టాటానగర్ పారిశ్రామిక వాడలు ఈ నియోజకవర్గం పరిధిలోకే వస్తాయి. అటు కేంద్ర, రాష్ట్ర కార్యాలయాలతో ఇటు పారిశ్రామిక వాడల్లో అన్ని రాష్ట్రాల ప్రజలు పని చేస్తున్నారు. ఏ నియోజకవర్గంలో లేని విధంగా అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ కలిసి మెలిసి ఉండటంతో దీనిని మినీ భారత్‌గా పిలుస్తున్నారు. నేషనల్ పోలీసు అకాడమితో పాటు అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని రాష్ట్రాల ప్రజలు వివిధ ఉద్యోగాల కోసం వచ్చి ఇక్కడే స్థిరపడుతున్నారు. ఒకరికొకరు గౌరవించుకుంటూ కలిసి మెలిసి తమ పండుగలను నిర్వహించుకోవడం నియోజకవర్గంలో ప్రత్యేకత. శరవేగంగా విస్తరిస్తున్న నిర్మాణ రంగం ప్రస్తుతం గండిపేట్, శంషాబాద్ మండలాల్లో కొనసాగుతుంది. ఇక్కడ పని చేసేందుకు సైతం అస్సాం, జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు చెందిన వారు వలస వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. అన్ని రాష్ట్రాల ప్రజల కలయికతో రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రస్తుతం కళకళలాడుతూ మినీ భారత్‌గా మారింది. ప్రస్తుతం నియోజకవర్గంలో 5,59,500 మంది ఓటర్లు ఉండగా... అంతే రెట్టింపు స్థాయిలో ఇతర రాష్ట్రాల్లో ఓటర్లుగా ఉన్న వారు ఉండటం విశేషం.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహ ఊరేగింపు



అమ్మవారి విగ్రహ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని భక్తిశ్రద్ధలందుకున్న అమ్మవారి విగ్రహ నిమజ్జన ఊరేగింపులు బుధవారం జరిగాయి. కార్పొరేషన్ పరిధిలోని డీడీ కాలనీలో అమ్మవారికి మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి చీరలను వేలం పాట నిర్వహించారు.

పాండురంగారావుకు ఘన నివాళి



చీరలను పంపిణీ చేస్తున్న తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు

గౌలిపురా: పాతనగర ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ప్రజా నాయకుడు ఎస్.పాండురంగా రావు అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. ఎస్.పాండురంగ రావు 22వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఛత్రినాక మిత్ర యువజన సంఘంలో ఆయన కుమారుడు, కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాండురంగా రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాండురంగా రావు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

జిలానీ అహ్మద్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థికి బుధవారం పీహెచ్‌డీ ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ పరిశోధక విద్యార్థి జిలానీ అహ్మద్ ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముఖీమ్ అహ్మద్ పర్యవేక్షణలో 'మెషిన్ లెర్నింగ్ అండ్ సెమాంటిక్ వెబ్ టెక్నాలజీతో వార్తా కథనాల అగ్రిగేషన్' అనే అంశంపై థీసిస్ సమర్పించారు.



అభివృద్ధి పనులకు అధికారుల సహకారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడంలో అధికారుల సహకారం ఎంతో ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం మొగల్ నగర్‌లో బస్తీలు, కాలనీల వాసులు, మసీదుల ఇమామ్, మోజంలతో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కార్వాన్ నియోజకవర్గంలో తాను ఎన్నో పనులు చేశానని అన్నారు. అభివృద్ధి పనులకు నిధులు ఉపయోగించడంలో తనకు మజ్లిస్ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసి ఎంతగానో సహకరించారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు అలీముద్దీన్ తదితరులున్నారు.

రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని మానుకోవాలి



రౌడీషీటర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీసీపీ రోహిత్‌రాజు

డబీర్‌పురా: రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని మానుకొని సమాజంలో మంచి వ్యక్తులుగా మెలగాలని సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బిరుదరాజు రోహిత్ రాజు సూచించారు. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదై ఉన్న చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖదీర్ ఇంటికి బుధవారం డీసీపీ రోహిత్ రాజు, అడిషనల్ డీసీపీ, మలక్‌పేట్ ఏసీపీలు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీపీ రోహిత్ రాజు మాట్లాడుతూ... రౌడీషీటర్లు ఎన్నికల సమయంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూదన్నారు. ఒక వేళ పదే పదే నేరాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాతబస్తీలో వైభవంగా ఉత్సవాలు

చార్మినార్: ఈసారి పాతబస్తీలో ఉత్సవాలు అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగాయని.. ముఖ్యంగా చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి పల్లకి సేవా సామూహిక ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగిందని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి మాజీ చైర్మన్, సుల్తాన్‌షాహీ జగదాంబ దేవాలయం కమిటీ చైర్మన్ రాకేశ్ తివారీ అన్నారు. ప్రముఖ సంఘసేవకులు బ్రహ్మానంద్ రెడ్డితో కలిసి ఆయన బుధవారం చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.